RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 256 | బుధవారం, ఫిబ్రవరి 25 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మినారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం

**అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి**

**పకడ్బందీగా పరీక్షల నిర్వహణ**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్**



**హైదరాబాద్,ఫిబ్రవరి24:** రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ,

మిగతా2లో...



## సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

**ఆరోగ్య, బీమా పథకాలపై హర్షం**

**సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇనర్ణయం తమకెంతో భరోసా నింపిందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు కలిసారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రశంసలు

మిగతా2లో...

## జిహెచ్ఎంసిలోనూ పాగా వేస్తాం

- ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గో÷-డలెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మి అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని

మిగతా2లో...

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

**అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ**

**మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్**



**భోపాల్,ఫిబ్రవరి24 :** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారం

మిగతా2లో...

## మీ అరచాకాలను ఇక సహించేది లేదు

- మా నేతలను జైలులో పెడితే భయపడబోం
- నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్
- బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కెటిఆర్



**ఆదిలాబాద్,ఫిబ్రవరి24 :** ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో

మిగతా2లో...

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

● ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా ● తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ - ప్యూర్ - రేర్' ● 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తి స్థాయిలో భరోసా కల్పించేలా,

మిగతా2లో...

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

**డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు**

**లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న**

**40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు**

**వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి**

**కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి**




**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన

మిగతా2లో...

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు**

**పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**



**హైదరాబాద్,ఫిబ్రవరి24 :** ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో 489126 మంది, సెకండియర్‌లో 507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు.

## కేరళ..ఇక నుంచి కేరళం

- కేంద్ర కేబినేట్ తీర్మానం




**కేరళ,ఫిబ్రవరి24 :** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. తమ రాష్ట్రం పేరును మార్చాలనే ప్రతిపాదనలు మలయాళీ ప్రజల నుంచి ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. కేరళను మలయాళంలో 'కేరళం' అని పిలుస్తారని.. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2023లో ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్స్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్‌ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్‌గాజడెట్‌లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఎమ్జెంగ్గ÷న్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా ఖి.ఖీ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

# మీ అరచాకాలను ఇక సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది.

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

(మొదటి పేజీ తరువాయి)

ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ – ప్యూర్ – రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు.

# మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984–89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010–16 మధ్య ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999–2000లో ఏటూరునాగారం–మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ (సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

# శశికళ కొత్త పార్టీ ప్రారంభం.. పేరును త్వరలో ప్రకటిస్తానని వెల్లడి

**చెన్నై,ఫిబ్రవరి24:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ కీలక ప్రకటన చేశారు. తమిళనాట కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. జయలలిత జయంతి సందర్భంగా రామనాథపురంలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో కొత్త పార్టీ ప్రకటన చేశారు. కొత్త రాజకీయ చరిత్రను మనం చూడబోతున్నామని, కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ద్రవిడ ఉద్యమం స్ఫూర్తితో అన్నాదురై, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ అడుగుజాడల్లో పార్టీని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. పేదలు, బడుగు వర్గాలు, సామాన్య ప్రజానీకం కోసం పార్టీ పాటుపడుతుందని, శత్రువులు, ద్రోహులను ఏరివేస్తామని శశికళ తెలిపారు. పార్టీ జెండాను ఈ సందర్భంగా శశికళ ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగి, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్తరువులతో ఈ జెండా రూపొందింది. పార్టీ పేరును త్వరలోనే ప్రకటిస్తామని శశికళ తెలిపారు. 2016లో జయలలిత మరణాంతరం జరిగిన సంఘటనలను శశికళ గుర్తుచేసుకుంటూ, అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా తనను ముఖ్యమంత్రి కావాలని కోరారని చెప్పారు. 'చిన్నమ్మా... మీరు తప్పనిసరిగా ముఖ్యమంత్రి కావాలి అని వాళ్లంతా నాతో అన్నారు' అని తెలిపారు. అయితే ఆ సమయంలో తాను వ్యక్తిగత పనులు ఉండటంతో అందుకు నిరాకరించానని, ఓ పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆ తదుపరి క్రమంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళను అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ప్రథమార్థంలో జరగాల్సి ఉన్నాయి.

# హైదరాబాద్‌లో నకిలీ టీ పౌడర్ అమ్మకాలు

- తయారీదారును పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,ఫిబ్రవరి24:**

హైదరాబాద్‌లో కల్తీ టీ పౌడర్ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. టాస్క్‌ఫోర్స్, వెస్ట్ జోన్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిందితుడైన ఫతేనగర్ నివాసి జగన్నాథ్ బిష్ణోయ్‌ను అరెస్ట్ చేశారు. కోకోపీట్, బెల్లం నీరు, సింథటిక్ ఫుడ్ కలర్స్‌తో కల్తీ టీ పొడిని జగన్నాథ్ తయారు చేస్తున్నాడు. ఒక కిలో టీ పౌడర్ తయారీ కోసం 50 గ్రా. కోకోపీట్ మిశ్రమం ఉపయోగిస్తున్నాడు. అలాగే సన్‌సెట్ ఎల్లో, టార్ట్రాజిన్ రంగులను వినియోగిస్తున్నాడు. దాడులకు పాల్పడిన పోలీసులు నిందితుడి వద్ద నుంచి 120 కిలోల కలర్ మిక్స్‌డ్ టీ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు . అలాగే 30 కిలోల నేచురల్ టీ పౌడర్, 138 కిలోల కోకోపీట్ మిక్స్, 800 గ్రా. సన్‌సెట్ కలర్, 700 గ్రా. టార్ట్రాజిన్ స్వాధీనం చేసుకున్నారు. జగన్నాథ్ ఈ కల్తీ టీ పౌడర్‌ను స్థానిక టీ స్టాల్స్, డీలర్లకు అధిక ధరకు సరఫరా చేస్తున్నాడు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

(మొదటి పేజీ తరువాయి)

నాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

# కేరళ..ఇక నుంచి కేరళం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. అయితే.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కొన్ని మార్పుల అనంతరం కేరళ అసెంబ్లీ మరోసారి ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తర్వాత ఇది ఇన్నాళ్లూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎట్టకేలకు మంగళవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఢిల్లీలో ఇటీవల ప్రారంభమైన నూతన 'సేవా తీర్థం' భవనంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశం ఇది. మొదటి తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్షించిన అనంతరం.. కొన్ని సాంకేతిక మార్పులతో కేరళ అసెంబ్లీ రెండోసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్.. రాజ్యాంగంలోని మూడో అధికరణ ప్రకారం.. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని భాషలలో 'కేరళం'గా సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. మలయాళంలో రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, జాతీయ స్వాతంత్ర్య పోరాట సమయం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉద్భవించిందని అన్నారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

(మొదటి పేజీ తరువాయి)

కురిపించారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నేతలు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# జిహెచ్ఎంసిలోనూ పాగా వేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

- బస్ టిక్కెట్ పొందే సౌకర్యం
- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,ఫిబ్రవరి24:** టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమీషనర్ రవికిరణ్‌తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ క్షఖఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది.మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.టి–24 టికెట్ పర్యాటకులకు, అప్పుడప్పుడు ప్రయాణించేవారికి మరియు ఒకే రోజులో బహుళ ట్రిప్పులు అవసరమయ్యే ప్రయాణీకులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్ , వెంకన్న, ఖుస్రో షా ఖాన్ ,రాజశేఖర్ , ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప , సిటీఎం శ్రీదేవి సిఈ(ఐటి) శ్ శ్రీదేవి, హైదరాబాద్ , రంగారెడ్డి ఆర్ఎం లు సుధాపరిమళ , శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరపాలి

**- సుప్రీంకోర్టు ఆగ్రహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి**

**- ఆర్‌పీఐ (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ :డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయం జరగకుండా, నిజాలు వెలుగులోకి రాకుండా వ్యవహరించిన ఉన్నత పోలీసు అధికారులపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ కేసులో అప్పటి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ను రక్షించేందుకు నిర్విరామంగా కృషి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, ఏలూరు డి.ఐ.జి పాల్ రాజ్, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె. వి. రాజేంద్రనాథ్ రెడ్డి గార్ల పాత్రపై నిష్పక్షపాత దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

డా. పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, ఈ హత్య కేసు సందర్భంగా సేకరించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీలలో కొన్ని మాయం చేసినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆ ఫుటేజీలను ఉద్దేశపూర్వకంగా తొలగించిన లేదా సమర్పించకుండా దాచిపెట్టిన వారిని గుర్తించి, వారి పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాక్ష్యాలను చెరిపివేయడం న్యాయ ప్రక్రియను దెబ్బతీసే ఘోర నేరమని ఆయన అన్నారు.అలాగే, ఈ కేసు సమయంలో జిల్లా ఎస్పీ మరియు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పలు దఫాలు సమావేశం అయినట్లు సమాచారం ఉందని, ఆ సమావేశాల పూర్తి వివరాలుతేదీలు, చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశాలు దర్యాప్తుపై ఎలాంటి ప్రభావం చూపాయో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

అదేవిధంగా, ఈ వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా కూడా డీజీపీ, డి.ఐ.జి, జిల్లా ఎస్పీల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు పోలీసు వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతత ఎంత ముఖ్యమో స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించినా, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఎంత పెద్ద అధికారులైనా చట్టం ముందు సమానమేనని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిట్ట వరప్రసాదు హెచ్చరించారు.

# నిధులు మంజూరైన అభివృద్ధి పనుల్లో ఆలస్యం ఎందుకు



**- మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- మహేశ్వరం నియోజకవర్గంలోనిగ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి పరిధిలోని మీర్పేట్,జిల్లాలగుడా డివిజన్లలో ఉన మంత్రాల చెరువు, చందనం చెరువు అభివృద్ధి పనులను మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి,స్థల పరిశీలన చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నిధులు మంజూరైనప్పటికీ చెరువుల సుందరీకరణ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని, దానికి గల కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఒక స్పష్టమైన ప్రణాళికతో చేపట్టాలని ఎప్పుడో నిర్ణయించిన అభివృద్ధి పనుల్లోఇంతటి అలసత్వం ఎందుకు చోటు చేసుకుంటోందని, నత్తనడకకు గల కారణాలపై జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ డీఈ వెంకన్నను ఎమ్మెల్యే నిలదీశారు. అదేవిధంగా,

చెరువుల పరిసరాల్లో నడక కోసం వచ్చిన వాకర్స్‌తో కలిసి నడుచుతూ,వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి మార్పులు చేర్పులు అవసరమోఆ విషయాలపై కూడా అధికారుల నుంచి స్పష్టత తీసుకుని, తక్షణమే సంబంధిత పనులు పూర్తి చేయాలని,సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాగే పనులు కొనసాగితే సహించబోమని స్పష్టం చేస్తూ,

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇకపై ఎలాంటి పనులు కూడా పెండింగ్‌లో ఉండకూడదని కఠిన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ డీఈ వెంకన్న, ఇతర ఏఈలు,

మీర్పేట్, జిల్లాలగుడా డివిజన్లకు

చెందిన నాయ కులు, మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాలి

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**




హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:-ఈ నెల 25వ తేదీ బుధవారం నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి చిన్న తప్పిదాలకు తవ్వివకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత ఆర్డీఓలు, ఎంపిడిఓలు, ఆర్.సి.లు, పోలీస్ శాఖ అధికారులు, విద్యుత్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ బుధవారం నుండి మార్చ్ 18వ తేదీ వరకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూప్ చేయాలన్నారు. ఆర్డీఓ కార్యాలయాలలో ఎగ్జామ్ సెల్ ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలో 200 పరీక్షా కేంద్రాల ద్వారా 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70, 171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు, జిల్లాలో మొత్తం 1,54,472 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు.

ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవ్వరూ కూడా మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లకూడదని, విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికాలు, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సరిత, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి, ద

పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి ఆమోదం



**- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పండ్ల రసాలతో అభిషేకం**

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- కోహెడ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో పండ్ల మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడం హర్షం వ్యక్తం చేసిన పాలకవర్గం. కృతజ్ఞతగా సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించిన మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మరియు సభ్యులు.. వర్తకులు..రైతులు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి ధన్యవాదములు తెలిపిన పాలకవర్గం. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ ప్రాంతంలో సర్వే నంబర్ 167 లో రాష్ట్ర ప్రభుత్వం 239 ఎకరాలు పండ్ల మార్కెట్ నిర్మాణానికి అధికారికంగా ప్రభుత్వం కేటాయించి ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు.. మరోసారి రైతుల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం నిలిచిందన్నారు..గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా రైతులు ..వర్తకులు నష్టపో యారని చెప్పారు. రైతు ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు..రైతు బాంధవుడిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని తెలిపారు..వీలైనంత త్వరలో శంకుస్థాపన చేపడతామని అన్నారు. ఇందుకు




సహ కరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి..ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి...రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావుకి...పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి...ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డికి.. ఎంపి శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి ..అధికారులకు అందరికీ పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జన,బాస్కర చారి పాలకవర్గం సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి దోమలపల్లి అంజ య్య...లక్ష్మి బండి మధుసూదన్ రావు. గణేశ్ నాయక్ మచ్చెందర్ రెడ్డి...నర్సింహావెంకటేశ్వర్లు గుప్తా.. .ఇబ్రహీం..తో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నా,శ్రీనివాస్.. అధికారులు... రైతులు...అధికారులు...సిబ్బంది పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ కార్యక్రమం



**- ముఖ్య అతిథి ఎమ్మెల్యే వీరపల్లి జయశంకర్**



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్, గ్రామంలో గ్రామపంచాయతీలను అభివృద్ధి దిశగా, గ్రామస్థాయి పరిపాలనను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి 2 వ రోజు ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు వంటి అంశాలపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్రామ పంచాయతీలు ప్రజలకు అత్యంత సమీప పరిపాలనా వ్యవస్థగా పనిచేస్తాయని, గ్రామ స్థాయిలో తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తాయని తెలిపారు. ప్రతి సర్పంచ్ గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, జ. సురేష్ మోహన్ జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో నిర్వహించబడుతున్న ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ చట్టాలు, నిధుల వినియోగం, ఆడిట్ విధానాలు, గ్రామ అభివృద్ధి ప్రణా ళికలు, శుభ్రత పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో సర్పం చులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య ఆరోగ్య రంగాల్లో మెరుగుదల సాధించేందుకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో 10 మందిలు, అధికారులు, కొత్తూర్, నందిగామ, ఫరూక్నగర్, కొందుర్గ్, జిల్లేడు చౌదరిగుడా

కేశంపేట సర్పంచులు (154) మంది పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం ముఖ్యమంత్రిని కలిసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:-కంటోన్మెంట్ నియోజకవర్గం లో వివిధ అభివృద్ధి పనులకు నిధుల కోసం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ముఖ్యంగా నియోజకవర్గంలో మహిళా భవన్, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు,బోర్ వెల్ ల నిర్మాణం కోసం 20 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పందించిన ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉంటానని, నిధుల విడుదలకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని చెప్పారు.

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

# కొమ్మాల జాతర బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష



హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్/వరంగల్ :వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కలెక్టరేట్ లో మంగళవారం గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు తేదీ మార్చి ఫిబ్రవరి 3 నుంచి మార్చి 8 వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పోలీస్, ఆరోగ్య, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, పౌర సంబంధాల, అగ్నిమాపక తదితర శాఖలు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

జాతర సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయం, అన్నదాన కార్యక్రమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, వైద్య శిబిరాలు, శానిటేషన్ చర్యలు సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జాతర ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వాహక అధికారిని సూచించారు.

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, తండ్రి బొర్రారామ రెడ్డి, పరమపదించారన్న విషయం తెలిసిన వెంటనే, నేడు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయతతో పలకరించి పరామర్శించారు. ఈ సందర్భంగా,దుఃఖసాంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే, పరమపదించిన రామిరెడ్డి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, వంగేటి లక్ష్మి, లక్ష్మారెడ్డి, చిగురింత పెద్ద నరసింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బొర్రా మాధవరెడ్డి, బొర్రా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో మేలు, క్రీడా మహోత్సవం 2026




హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం : గురు నానక్ విద్యాసంస్థలు, గురు నానక్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో "క్రీడా మహోత్సవం--2026" ఉత్సాహభరితంగా జరిగింది. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు.

ఈ కార్యక్రమాన్ని గురు నానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గురు నానక్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాటాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు కీలకమని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో అవి ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. డైరెక్టర్ ప్లానింగ్ అండ్ స్టూడెంట్ వెల్ఫేర్ డా. పి. పార్థసారథి ఆధ్వర్యంలో, యూనివర్సిటీ రెక్టర్, రిజిస్ట్రార్, ఇతర డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, డీన్లు, విభాగ అధిపతుల సమన్వయంతో, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురు నానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్, గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ తమ సందేశం ద్వారా సిబ్బంది, విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు జట్టు భావన, నాయకత్వ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# దేవాలయ నిర్మాణం కోసం విరాళం అందజేసిన బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్

**- ఫౌండేషన్ బూడిద రామ్ రెడ్డి సేవలు మరువలేనివి**





హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:-ఆరుట్ల గ్రామంలో శ్రీ మల్లన్న దేవాలయం నిర్మాణంలో భాగంగా ఈ రోజు ఉప్పరిగూడ మాజీ సర్పంచ్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి ఆర్ ఆర్ పౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డిని కలిసి ఆలయ నిర్మాణనానికి సహాయం కోరగా వారు వెంటనే స్పందించి, తన సహాయం యాదవ సంఘం పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామ వార్డు సభ్యులు పున్నం రాము, గొర్ల కాపరుల సొసైటీ ప్రధాన కార్యదర్శి బైకని మహేందర్ యాదవ్, యాదవ సంఘం పెద్దలు బోయినీ బలరాజు యాదవ్, బోయిని మల్లయ్య, శివయ్య, చీమల యాదయ్య, సత్తయ్య, దోమ జంగయ్య, బోయిని దానయ్య, ఐలయ్య, గునుకుల శ్రీశైలం, పుణ్యమూర్తి యాదయ్య, బైకని శ్రీకాంత్, దోమ మధు, నరసింహ, చింటూ యాదవ్ గ్రామ యువకులు కొత్తపల్లి సాయి గౌడ్, అరుణ్, బూర పవన్‌లి పాల్గొన్నారు.

యాదవ సంఘం పెద్దలు రామ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఆ మల్లన్న స్వామి ఆశీస్సులు తనపై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పెన్షనర్ల సంఘాల నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:-ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి ఆరోగ్య పథకం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి తమ దశాబ్దాల కోరిక నెరవేర్చారంటూ ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడంతో పాటు, రూ.1,056 కోట్ల మూలనిధితో ఆరోగ్య పథకానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెల పడంపై ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని, 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలు పొందే అవకాశం కల్పించడం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒక వరమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేతృత్వంలోని క్యాబినెట్ ఉద్యోగ వర్గాల ప్రయోజనాలకు



పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐకాస నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి.దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), కే.వెంకటేశ్వర్లు (టీఎన్జీవో), ఉపేందర్ రెడ్డి (టీజీవో), జి.సదానందగౌడ్ (ఎస్టీయూ), దామోదర్ రెడ్డి, ఉమాదేవి (పెన్షనర్స్), వి.రవీందర్ రెడ్డి (రెవెన్యూ), గిరి శ్రీనివాస్ రెడ్డి (సెక్రటేరియట్), ఖాదర్ (ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్), టి.లక్ష్మన్ (ఎక్సైజ్), తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ (డిప్యూటీ కలెక్టర్ల సంఘం), ఎస్.రాములు, రమేష్ పాక, సీహెచ్.శ్రీనివాస్ (తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్), బాణాల రాంరెడ్డి, వి.భిక్షం (తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్), డా.నిర్మల, ఎల్.దశరథ్ (టీజీసీపీఎస్ఈయూ), గరికె ఉపేందర్‌రావు (జీపీవో), సుగంధిని (హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌డబ్ల్యూ), భూమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కవరేజీకి వెళ్తున్న జర్నలిస్టుల అరెస్టు సరికాదు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) ఫిబ్రవరి24:- ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో పేదల గుడిసెల కూల్చివేతల ఘటనను కవర్ చేసేందుకు వెళ్తున్న మీడియా ప్రతినిధులను అరెస్టు చేయడం దారుణం, వార్త కవరేజీ కోసం హైదరాబాద్ నుంచి ఖమ్మంకు వెళ్తున్న జర్నలిస్టులను నకిరేకల్ టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిజం గురించి చెప్తాం.. ప్రజల పక్షాన నిష్పాక్షికంగా వార్తలు కవర్ చేసే జర్నలిస్టులను ప్రివెంటివ్ అరెస్టుల పేరుతో నిర్బంధించడం అంటే రాష్ట్రం పాలన ఏ దిశగా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చుప్రజాస్వామ్యంలో ఇలాంటి అరెస్టులకు స్థానం లేదు.. జర్నలిస్టుల అరెస్టుల ఘటనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

# ష్యూరిటీ అక్కర్లేదు తక్కువ వడ్డీతో కొత్త లోన్ స్కీమ్

ఆర్థిక అవసరాలు ఎప్పుడు, ఏ రూపంలో తలుపు తడతాయో ఎవరూ చెప్పలేరు. ఇంటి శుభకార్యాలు, పిల్లల చదువులు లేదా అనుకోని అనారోగ్యం.. కారణం ఏదైనా కావచ్చు. ఇలాంటి సమయాల్లో ప్లేస్టోర్‌లోని నకిలీ లోన్ యాప్‌ల ఉచ్చులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవడం కంటే, నమ్మకమైన బ్యాంకును ఆశ్రయించడం మేలు. అందుకే దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్ల కోసం ఒక అద్భుతమైన లోన్ ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం ఒక్క మిస్డ్ కాల్ ఇస్తే చాలు.. లక్షల రూపాయల పర్సనల్ లోన్ మీ ఖాతాలోకి వచ్చేలా ఈ ప్రక్రియను సరళతరం చేసింది.ఎస్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త పర్సనల్ లోన్ స్కీమ్ ప్రత్యేకత ఏంటంటే, ఎటువంటి ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు మీ అర్హతను బట్టి కనీసం రూ. లక్ష నుంచి గరిష్టంగా రూ. 50 లక్షల వరకు భారీ మొత్తాన్ని లోన్‌గా పొం దవచ్చు. వడ్డీ రేట్లు కూడా ప్రైవేట్ యాప్‌లతో పోలిస్తే చాలా తక్కువగా అంటే 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. ఈ అప్పును తీర్చడానికి బ్యాంకు మీకు 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు సుదీర్ఘ గడువును ఇస్తోంది. ఒకవేళ మీకు ఇప్పటికే ఒక లోన్ ఉన్నా, అవసరమైతే రెండోసారి కూడా లోన్ తీసుకునే ఛాన్స్ ఉండటం గమనార్హం.

అర్హత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, రైల్వేస్ మరియు గుర్తింపు పొందిన కార్పొరేట్ కంపెనీల్లో పనిచేసే వారు.




జీతం: ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం రూ. 20,000, ప్రైవేట్ రంగ ఉద్యోగులకు రూ. 25,000 నెలవారీ వేతనం ఉండాలి.

సర్వీస్: ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం 6 నెలలు, ప్రైవేట్ ఉద్యోగులకు 12 నెలల పని అనుభవం ఉండాలి.

వయసు: 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండి, మంచి క్రెడిట్ స్కోర్ ఉండటం తప్పనిసరి. ఎస్బీఐలో శాలరీ అకౌంట్ ఉన్నవారికి ఈ ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుంది.

ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు ఞ డాక్యుమెంట్స్

సాధారణంగా లోన్ అంటే డాక్యుమెంట్ల మోత ఉంటుంది. కానీ ఇక్కడ ఆధార్, పాన్ కార్డ్, గత ఆరు నెలల పే స్లిప్స్ మరియు బ్యాంక్ స్టేట్‌మెంట్ ఉంటే సరిపోతుంది.

ముఖ్యమైన విషయం ఏంటంటే..

డిఫెన్స్ ఎంప్లాయిస్‌కు మరియు ప్లాటినం ప్యాకేజీ ఉన్నవారికి ప్రాసెసింగ్ ఫీజు పూర్తిగా మాఫీ చేశారు.

మిగిలిన వారికి కూడా వారి క్రెడిట్ స్కోర్‌ను బట్టి ఫీజులో 50 శాతం వరకు రాయితీ లభిస్తోంది.

అతి తక్కువ పేపర్ వర్క్ ఉండటంతో లోన్ మంజూరు కూడా మెరుపు వేగంతో జరుగుతుంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మీడియా ముసుగులో సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్న శక్తులు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి సూర్యాపేట :ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలుస్తూ,వాస్తవాలను వెలుగులోకి తెస్తూ,సమాజ వికాసానికి నాలుగో స్తంభంగా పని చేయాల్సిన మీడియా...అబద్ధాలను,అసత్యాలను,అనుచితాలను అలవోకగా ప్రచారం చేస్తూ సమాజాన్ని తప్పుదారి పటిస్తుంది."మీడియా ముసుగులో సమాజాన్ని తప్పుదారి పట్టించే వారిని ఏరిపారేయాలి".ఈ వాక్యం దేశంలో ఇప్పుడు సామాన్యుల నోట నుంచి వినిపిస్తున్న ఆవేదన మాత్రమే కాదు, భవిష్యత్ మీడియాపై ఆందోళన కూడా.కానీ,ఇది కేవలం కోపం కాదు,ఇది ఒక హెచ్చరికగా చూడాలి.ప్రస్తుతం మీడియా (ప్రింట్,ఎలక్ట్రానిక్ (టీవీ), డిజిటల్,సోషల్ మీడియా) మొత్తం కలిసి సమాజం యొక్క మెదడును ఎలా మార్చేస్తున్నాయో చూస్తే,ఈ ప్రజా ఆవేదన అందరికీ అర్థమ వుతుంది. "ఏరిపాయాలి"అనేది హింస కాదు,అది సమాజం యొక్క బాధ్యతగా, జవాబుదారీతనంగా,చట్టపరమైన శిక్షగా అర్థం చేసుకోవాలి.

ముసుగు మీడియా ఎలా పని చేస్తోంది?

మీడియా అనేది సమాజ రక్షణ కావాలి,కానీ,నేటి సమాజంలో అది "టీఆర్పీ రాక్షసుడు"గా మారిపోయి సెన్సేషనలిజం కోసం అడ్డదార్లు తొక్కుతుంది.ముఖ్యంగా తెలుగు మీడియాలో "బ్రేకింగ్ న్యూస్" అని ప్రతి చిన్న విషయాన్ని బ్లో అప్ చేసి, సమాజంలో భయం,కోపం,ద్వేషం కలిగిస్తున్నారు.చివరికి సమాజానికి ఎలాంటి ఉపయోగం లేని తెరపై నటించే ఒక నటుడు,ఒక యాంకర్ వివాదాన్ని కూడా రోజుల తరబడి బ్రేకింగ్ అంటూ రన్ చేసి, ప్రజలకు బోర్ కొట్టిస్తున్నారు.దేశ మనుగడ,ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా విచ్చలవిడి తనాన్ని రెచ్చిపోయి ప్రసారం చేస్తున్నారు.ఈ విధానంలో మార్పు రావాలి.ఫేక్ న్యూస్ అండ్ డీప్‌ఫేక్స్

2025 మేలో భారత్–పాకిస్తాన్ సంక్షోభంలో "కిరాణా హిల్స్‌పై దాడి,రేడియో ఆక్టివ్ లీకేజ్" అనే ఫేక్ వీడియోలు,డాక్టర్డ్ లెటర్లు వైరల్ అయ్యాయి.ఇవి సామాన్యులను మాత్రమే కాదు, రాజకీయ నాయకులను కూడా మోసగించాయి.ఎన్నికల సమయంలో,మతపరమైన ఘర్షణల్లో,కొన్ని మీడియా హౌసులు ఒక వైపు ప్రచారం చేసి సమాజాన్ని ధ్రువీకరిస్తూ, పొలిటికల్ డిస్‌ఇన్ఫర్మేషన్ ను తెరపైకి తెస్తాయి.వికీపీడియా ప్రకారం... భారత్‌లో ఫేక్ న్యూస్ వల్ల 2018లోనే 20 మంది మృతి చెందారని నివేదికలు చెబుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు.ప్రపంచ ఆర్థిక ఫోరమ్ గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2025 –26 ప్రకారం...మిస్‌ఇన్ఫర్మేషన్ ప్రపంచంలోనే అతి పెద్ద ముప్పుగా పరిణమిస్తుంది. దీనితో మీడియాపై సమాజానికి నమ్మకం కోల్పోయే ప్రమాదం



దాపురించింది.2026లో జర్నలిజం ట్రస్ట్ క్రైసిస్ గురించి ది వైర్ రిపోర్ట్ చెప్పినట్టు,పొలిటికల్ డిస్‌ఇన్ఫర్మేషన్ పరంగా భారత్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 151వ స్థానంలో ఉంది. అందుకే మీడియాలో వచ్చేవి నూటికి 90% ప్రజలు "అబద్ధాలు" అని నమ్మేస్తున్నారు.సామాజిక విభజనకు కారణమవుతుందిమతాలకు,కులాలకు,ప్రాంతాలకు,రాజకీయాలకు అతీతంగా నిలుస్తూ,నిత్యం నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా, నిర్భయంగా,నిస్సంకోశంగా,నికరంగా,నిజాయితీగా,నిబద్ధతతో కూడిన వార్తల్ని అందివ్వాల్సిన మీడియా మతం, కులం ,ప్రాంతాల మధ్య ద్వేషం పెరిగేలా అసంబద్ధ అవాస్తవాలను వడ్డి వారించడంతో సమాజ విభజనకు దారితీస్తుంది.ఇక సోషల్ మీడియా ద్వారా ప్రజా క్షేత్రంలోకి వస్తున్న ఒక్కో పోస్ట్ లక్షల మందిని రెచ్చగొడుతుంది. అది చిలికి చిలికి గాలి వానగా మారి,సమాజ వినాశనానికి కారకంగా మారుతుంది.ఫేక్ న్యూస్ వల్ల షేర్ మార్కెట్ పడిపోవడం,ఎన్నికల్లో తప్పుడు ఫలితాలు రావడం కూడా సాధ్యమే అనేలా ప్రస్తుతం మీడియా హైప్ కొంసాగుతుంది.చట్టాలు మరియు చర్యలు ఎక్కడా?

భారత్ ప్రభుత్వం ఇంత జరుగుతున్నా ఏం చేస్తుందంటే నిద్ర మాత్రం పోలేదు.కానీ,నిద్ర నటిస్తుంది.అందుకే ఎవరి ఇష్టానురం వారు అవాస్తవాలను ప్రజలపై రుద్దుతున్నారు.ఐటీ రూల్స్ 2021 మరియు అమెండమెంట్స్ ప్రకారం డిజిటల్ మీడియాకు కోడ్ ఆఫ్ ఎథిక్స్ లేకుండా పోయాయి. 2025 లో సింథటిక్ మీడియా (డీప్‌ఫేక్స్) లేబులింగ్ బాధ్యత తీసుకొని ఫేక్ కంటెంట్ తొలగించాలి.ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా–2025 గైడ్ లైన్స్ ప్రకారం...నేషనల్ ప్రెస్ డే థీమ్ "సేఫగ్వేర్డింగ్ ప్రెస్ క్రెడిబిలిటీ ఏమిడీస్ట్ రైసింగ్ మీస్ న్ఫర్మేషన్ "ఫాక్ట్ చెక్ యూనిట్స్ ద్వారా కేంద్ర,రాష్ట్ర స్థాయిలో నార్మ్స్ ఆఫ్ జర్నలిస్టిక్ కండక్ట్‌తో ఫేక్ న్యూస్‌పై చర్యలు తీసుకోవాలి.

2025 నుంచి జమ్ము కాశ్మీర్‌లో 28 ఫేక్ న్యూస్‌పై రిబట్టల్స్ జరిగాయి.సెల్ఫ్ టష రెగ్యులేషన్ బ్రాడ్‌కాస్టర్స్ సెల్ఫ్ రెగ్యులేటరీ బాడీలు ఉన్నాయి.కానీ,ఇవి సరిపోవడం లేదు.ఎందుకంటే అమలు బలహీనం,కొన్ని మీడియా హౌసులు రాజకీయ రక్షణలో ఉన్నాయి కాబట్టి.ఏరిపారేయడం ఎలా

"ఏరిపారేయాలి" అంటే జైళ్లకు పంపాలి,లైసెన్స్ రద్దు చేయాలి, సమాజం బహిష్కరించాలి.కానీ, ఇదంతా చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా మాత్రమే జరగాలి.అదే సమయంలో మీడియా లిటరసీపై ఫోకస్ చేయాలి. పాఠశాలల్లో,కాలేజీల్లో "ఎలా ఫేక్ న్యూస్ గుర్తించాలి" అనే కోర్సు తప్పనిసరి చేయా స్వతంత్ర రెగ్యులేటరీ బాడీని ఏర్పాటు చేసి,క్రాస్–ప్లాట్‌ఫాం ఫేక్ న్యూస్‌పై స్వతంత్ర బాడీ (పార్లమెంటరీ కమిటీ సిఫార్సు 2025) కఠినతరం చేయాలి.అల్గారితం ట్రాన్స్‌పరెన్సీలో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివి ఫేక్ కంటెంట్ ఎందుకు ప్రమోట్ చేస్తున్నాయో వెల్లడించాలి.

ఎడిటర్,జర్నలిస్ట్ జవాబుదారీ తనం చూపించాలి.ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేస్తే అక్రెడిటేషన్ రద్దు, జరిమానా,జైలు శిక్షలు అమలు జరపాలి.ఇందులో ప్రజల బాధ్యత కూడా ఇమిడి ఉండాలి.

ఫేక్ న్యూస్ ని షేర్ చేయకుండా, ఫాక్ట్ చెక్ చేసి (ఆల్ట్ న్యూస్ , బూమ్ లైవ్ వంటి సైట్లు ద్వారా చెక్ చేసుకుని) ముందుకు వెళ్లాలి.ఫేక్ న్యూస్ ప్రసారం చేసే మీడియాను బహిష్కరించడం ఒక మార్గం కావచ్చు,కానీ,మంచి మీడియాకు మద్దతు ఇవ్వాలి.చివరగా సత్యం గెలవాలంటే మీడియా ముసుగులో దాక్కున్న వారిని సమాజ శత్రువులుగా గుర్తించి వారిని "ఏరిపారేయాలి" అది సరైనదే అయినా దానికి మార్గం బలమైన చట్టాలు,మీడియా స్వీయ నియంత్రణ,ప్రజల అవగాహన,ప్రెస్ ఫ్రీడమ్ బలపడాలి.దానితో పాటు ప్రతి ఒక్కరిలో బాధ్యత కూడా ఉండాలి.మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నాం. సత్యం వెలుగులోకి వచ్చేలా, అబద్ధాలు చీకటిలో కలిసిపోయేలా చేయాలి.మీరు ఏం చేస్తారు? ఫేక్ న్యూస్ షేర్ చేస్తారా? లేదా ఆపేస్తారా?ఆలోచించండి.ఈ దిశగా సమాజం,మీడియా మేల్కొనాలి, లేదంటే మనమే తప్పుదారి పట్టిపోతాం.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్**

# ధరణి తర్వాత బూభారత్ దందా: కాంగ్రెస్‌పై బొక్క నరసింహ రెడ్డి తీవ్ర విమర్శలు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి :భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సిమ్మా రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి'పేరుతో రైతులను దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం బూభారత్' పేరిట అధికారులను అడ్డం పెట్టుకుని రైతులను నిలువునా ముంచుతోందని ఆరోపించారు.ఈరోజు మండల పరిధిలోని ఆర్‌డీఓ కార్యాలయం ముందు బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.కందుకూరు మండలానికి చెందిన రైతుల పట్టా భూములను గవర్నమెంట్ భూములుగా చూపి ంచడం,హెచ్‌ఎండీఏ వెంచర్లను సైతం బూధన్ భూములుగా నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా బొక్క నర్సిమ్మా రెడ్డి మాట్లాడుతూ,గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసి కోట్లు గడించిందని,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొట్టకొట్టే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.రెండు ప్రభుత్వాలు రైతుల భూములను నిషేధిత జాబితాలో ఉంచి కోట్లు సంపాదిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నాయన్నారు.రైతు ఏడ్చిన రాజ్యం,ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ముందుకు పడిన చరిత్ర లేదు"అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల కన్నీటి శాపంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని,ముఖ్యమంత్రి నీ ప్రజలు తరిమికొట్టే రోజు దగ్గరలోనే




ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె కృష్ణ గౌడ్,జిల్లా నాయకులు జిట్టా రాజేందర్ రెడ్డి,సాధ మల్లారెడ్డి,నల్లబోలు నర్సిమ్మా రెడ్డి, బొక్క సత్యానారాయణ రెడ్డి,చిలుకల రఘునందన్,గౌర ప్రభాకర్,బక్క మల్లేష్, సోమరాజు వెంకటేష్,ఇంద్రకంటి రవీందర్ గౌడ్,సూరసాని భూ మిరెడ్డి,దేశం సత్తిరెడ్డి,కళ్లెం సుధాకర్ రెడ్డి,సామల



దయాకర్ రెడ్డి,బాలరాజే రాములు,నర్సింమా రామకృష్ణ, శ్రీరాములు,కళ్లెం చెన్నారెడ్డి,సత్యం గౌడ్,పాండు, సురేష్, బాలకృష్ణతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు,రైతులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ,జడ్పిటిసి,జిహెచ్ఎంసి ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం: ప్రచార రథాల ప్రారంభం



కాంగ్రెస్ అభ్యర్థులను ఘన విజయం సాధిం పజేయాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా ప్రచార కమిటీ కో–ఆర్డినేటర్లను నియమించారు.మహేశ్వరం మండలం:రాజు నాయక్,నడికుడి శివ,రాఘవేందర్ రెడ్డి.కందుకూరు మండలం: సరికొండ మల్లేష్,విష్ణువర్ధన్ రెడ్డి,ఢిల్లీ శ్రీధర్, గాదె కుమార్.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి :రానున్న ఎంపీటీసీ,జడ్పిటిసి,జిహెచ్ఎంసి ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్,మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అఖండ మెజార్టీ అందించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీయే సాధించగలదని స్పష్టం చేశారు. రానున్న ఎంపీటీసీ,జడ్పిటిసి,జిహెచ్ఎంసి ఎన్నికల్లో కూడా



# రాష్ట్ర స్థాయి సీఎం కప్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల జోరు

**– ఒకే స్కూల్ నుంచి 12 మంది రాష్ట్ర స్థాయికి ఎంపిక**




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి :రాష్ట్ర స్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలలో శ్రీ చైతన్య స్కూల్ కందుకూరు బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ చాటారు.ఒకే స్కూల్ నుంచి 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఆడటం విశేషంగా నిలిచింది.వారి ప్రతిభతో కందుకూరు ప్రాంతానికి గౌరవం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఢ డైరెక్టర్ విద్య మేడం,శ్రీధర్ సార్ విద్యార్థులను అభినందించారు.అలాగే ఏటీఎం పల్లె వెంకటేష్,కోఆర్డినేటర్ హోలీ,ప్రిన్సిపాల్ స్పందన,డీన్ మధు,ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ వెంకటేష్,పిటి కిరణ్ విద్యార్థులను ప్రోత్సహించారు.రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు:ధనుష్ (కందుకూరు),ఢిల్లీ శివ (మీరఖాన్‌పేట్),అఖిల్ (కందుకూరు), హర్షిత్ (తిమ్మపల్లి),విఘ్నేష్ (ముచర్ల), ఢిల్లీ సాత్విక్ (బేగరికంచ),జెర్పుల ప్రవీణ్ (సార్లపల్లి), ఉట్టు ప్రేమ్ (సాయిరెడ్డిగూడ), రామ్ చరణ్ (మురళీనగర్), సాయి (సార్లపల్లి), మనోహర్ (సార్లపల్లి) తదితరులు.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ విజయాన్ని సాధించామని స్కూల్ యాజమాన్యం తెలిపింది.భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

# ఇంటర్ పరీక్షల నేపథ్యంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు

**– పరీక్షా కేంద్రాల వద్ద గుంపుల నిషేధం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాలు**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి :తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నిర్వహించనున్న వార్షిక ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేయాలని పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు.ఆదేశాల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా చేరడం నిషేధించబడింది. ఈ ఆంక్షలు ఫిబ్రవరి 25 ఉదయం 6 గంటల నుంచి మార్చి 18 సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటాయి. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (గతంలో సెక్షన్ 144 సిఆర్.పిసి) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది, హోంగార్డులు,మిలిటరీ సిబ్బంది,విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షలు వర్తించవని తెలిపారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో

**– రూ.95 వేలకే మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స**

**– ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని**







హైదరాబాద్, ఫిబ్రవరి 24: పేద రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కాచిగూడలోని సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తోందని ట్రస్టీ ఎస్.సుకుమార్, జనరల్ మేనేజ ర్లు ఏ.సోమారెడ్డి, కే.శేషాద్రి, పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. మంగళవారం కాచిగూడలోని హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ శశిధరన్, డాక్టర్ జి. ప్రతాప్ రెడ్డి, డాక్టర్ గోవింద్ గాంధీ లతో కలిసి వారు మాట్లాడారు. హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకునే పేద రోగులకు నందిని రమేష్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేలు సబ్సిడీగా అందిస్తున్నట్లు వా రు తెలిపారు. ఇతర కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.2లక్షల వరకు అయ్యే ఖర్చును సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్సకు రూ.1,45,000 వరకు ఖర్చు అవుతుందని, అందులో ట్రస్ట్ ద్వారా రూ.50వేలు చెల్లిస్తుండటంతో ప్రత్యేక ప్యాకేజీతో రూ. 95 వేలకే మోకాలికీలు మార్పిడి శస్త్ర చికిత్స పూర్తవుతుందని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించదని స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఆరోగ్య బీమా సదుపాయం ఉన్న వారు, సి.జీ.హెచ్.ఎస్ ఉద్యోగులు ఈ సదుపా యాన్ని వినియోగించుకోగలరని తెలిపా రు. అమెరికా టెక్నాల జీతో చేయబడిన ఇంప్లాంట్ ఉపయోగిస్తూ అనుభవజ్ఞు లైన ఆర్థోపె డిక్ వైద్యులచే శస్త్ర చికిత్సలు చే యడం జరుగుతుందన్నారు. చికి త్సా విధానంలో ఏలాంటి మార్పు ఉండదని, అన్ని కార్పొరేట్ ఆసు పత్రుల్లో అందుతున్న మాదిరిగానే ఇక్కడ వైద్య సేవలు అందుతాయ ని వారు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండో రోజు నడిపించ డం జరుగుతుందని, మూడో రోజు డిస్ ఛార్జ్ చేస్తామని తెలిపారు. రెండు వారాల తరువాత పనులను యదావిధిగా చేసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబర్: 799 5273377 ద్వారా సంప్రదించ వచ్చునని వారు సూచించారు.

